క్లుప్తంగా


గృహ నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న నర్సింగరావు

ఎల్.ఎన్.పేట: పేద ప్రజలకు మంజూరు చేసిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ డీఈ నర్సింగరావు అన్నారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో సిబ్బంది, గ్రామ సచివాలయ ఇంజినీరింగు అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయటం జరిగిందన్నారు. ఆయా స్థలాల్లో ఇల్లు కట్టుకునే లబ్ధిదారులను గుర్తించి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణస్థాయిని బట్టి వెంట వెంటనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. హౌసింగ్ ఏఈ రమేష్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



ప్రకాశరావు (ఫైల్)

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉపాధ్యాయుడిగా, అధ్యాపకునిగా పనిచేసిన ఎల్లా పంతుల వెంకట సూర్యప్రకాశరావు శ్రీకాకుళం న్యూ కాలనీలోని తన ఇంటి వద్ద అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటూ అందరితో మమేకమై విద్యా బోధన చేసేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మామిడి క్రాంతి, ఊన్న రాజశేఖర్, వీవీ రాజు, నరేంద్ర, మాడుగుల మాదవ్, వై. రవికుమార్ తదితరులు సంతాపం తెలియజేశారు.

యువత శ్రమదానం



శ్రమదానం చేస్తున్న యువత

పొందూరు: కనిమెట్ట గ్రామానికి చెందిన డ్యాంగిల్ యువత శ్రమదానం చేసి ఆదర్శంగా నిలిచారు. మండల పరిషత్ పాఠశాల ఆవరణలోని మంచినీటి బావిని శ్రమదానం చేసి శుక్రవారం పరిశుభ్రం చేశారు. బావిచుట్టూ మురుగుతో పాటు చెత్త, చెదారాలను, కాలువను శుభ్ర పరిచారు. మహిళలు, గ్రామస్తులు యువకులను అభినందించారు.

లైదాంలో ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పొందూరు: లైదాం గ్రామంలో సర్వే నంబరు 28లోని కొత్త చెరువు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. కొత్త చెరువును కొంత మంది ఆక్రమించడంతో దీని పరిధిలోని ఆయకట్టులో ఉన్న కొన్ని వందల ఎకరాలకు సాగునీటికి ఇబ్బంది కలిగింది. దీంతో ఉత్తరాంధ్ర చెరువు పరిరక్షణ సమితి ప్రతినిధులు జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ రాంబాబు వీఆర్వో లోకేష్‌ల సమక్షంలో ఆక్రమణలు తొలగించారు.

వేలాడుతున్న వీధిలైటు



వేలాడుతున్న వీధిలైటు

సారవకోట: తొగిరి గ్రామంలోని కోవెల వీధిలో విద్యుత్ స్తంభానికి ఉన్న వీధిలైటు స్తంభం నుంచి విడిపోయి వేలాడుతోంది. కొన్ని రోజులుగా ఇలాగే వేలాడుతున్నా సంబంధిత సచివాలయ జేఎల్ఎం పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. వైరు తెగిపోయి కిందకు పడకముందే సరి చేయాలని కోరుతున్నారు.

తప్పిన ప్రాణాపాయం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు చినబాడాం గ్రామానికి చెందిన నిమ్మకాయల పండు అనే యువకుడుకు శుక్రవారం విషపూరిత పాము కరవడంతో అత్యవసర పరిస్థితిలో పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు డాక్టర్ చిన్నంనాయుడు సత్వరమే వైద్యసేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఖరీదైన ఇంజక్షన్‌లు అందుబాటులో ఉండటంతో యువకుడిని కాపాడగలిగామని తెలిపారు. యువకుడిని పట్టణ సచివాలయాల కన్వీనర్ బడగల బళ్లయ్యనాయుడు, నాయకులు పరామర్శించారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- జోడూరు సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సవర పోలూరులో గిరిజనులకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి

మెళియాపుట్టి: పేదలు ఆర్థిక పరిపుష్టి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. జోడూరు గ్రామ సచివాలయం పరిధిలోని మారడికోట, కొత్త మారడికోట, నాయుడు పోలూరు, సవర పోలూరు, సీడిపాలెం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాను వివరించారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. నవరత్నాల కరపత్రాలను పంపిణీచేశారు. కొత్త మారడికోట గ్రామానికి చెందిన తమిరి తాతారావు కుటుంబ సభ్యులకు విద్యాదీవెన, వసతి దీవెన, రైతుభరోసా తదితర పథకాల ద్వారా రూ 2.5 లక్షలు లబ్ధి పొందినట్టు ఎమ్మెల్యేకు చెప్పి ఆనందం వ్యక్తం చేశారు. అదేగ్రామానికి చెందిన పెద్దంటి సంజీవరావు రూ. 8 లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ప్రభుత్వం రూ. 2 లక్షల రాయితీ ఇచ్చిందని, వ్యవసాయం చేసుకుంటూ సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. లబ్ధిదారు నందిగాం లచ్చయ్య మాట్లాడుతూ.. పాఠశాలలో తమ మనవళ్లకు అమ్మఒడి వచ్చిందని, బ్యాగులు, షూ, బట్టలు, పుస్తకాలు, భోజనం అన్నీ ఉచితంగానే ఇస్తున్నారని.. ఇంతకంటే ఇంకేం కావాలని సంతోషం వ్యక్తం చేశారు. మారడికోట గ్రామానికి చెందిన జంప గంగమ్మ ఆసరా డబ్బులతో తినుబండారాలు తయారుచేసి విక్రయిస్తున్నానని.. వ్యాపారం బాగా సాగుతుందని, ఇదంతా జగనన్న చలువేనని అంటూ ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. నాయుడు పోలూరు గ్రామంలో గిరిజనులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ. 6 లక్షలతో ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ పెద్దింటి భాగ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు, బాలకృష్ణ టి.ప్రసాదరావు, ఎంపీడీవో చంద్రకుమారి, ఏవో దానకర్ణుడు, పరిపాలనా అధికారి తిరుపతి పటాన్నయక్, ఏపీవో రవికుమార్ ఆర్ఐ వై.కుంతరావు, కార్యదర్శి ఢిల్లేశ్వరరావు, పలువురు సచివాలయ అధికారులు, పలువవురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం చేరువ



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గోనెపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సరుబుజ్జిలి: అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేరువ చేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గోనెపాడు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలోని 300 ఇళ్లను స్పీకర్ సందర్శించి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధి పథకాల గురించి తెలియజేశారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజలు చెప్పిన సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడం చారిత్రాత్మకమని కొనియాడారు. అర్హత ఉండి పథకాలు అందనివారు తమ దృష్టికి తెస్తే పథకం మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు , ఎంపీడీవో పీవీ మురళీమోహన్‌కుమార్, మండల పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, స్థానిక సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, పార్టీ నాయకులు మామిడి తిరుపతిరావు, బిర్లంగి నాగేశ్వరరావు, సనపల తవుడు, వీరఘట్టపు కృష్ణ, పాల్గొన్నారు.

పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు



పాతపట్నం: పోలీస్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న సీఐ వినోద్‌బాబు

పాతపట్నం: పాతపట్నంలో జరుగుతున్న నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అధికారులు పోలీసు కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను సీఐ ఎం.వినోద్‌బాబు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అమ్మవారి ఆలయం నుంచి కోర్టు కూడలి, ఆస్పత్రి కూడలి, ఆల్‌ఆంధ్ర రోడ్డు జంక్షన్, అంతరాబ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అలాగే ఆస్పత్రి జూబ్లీ రోడ్డు నుంచి కాపువీధి వరకు సీసీ కెమెరాలు, మైక్ సెట్‌లు, ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పనితీరు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని ఎస్సై ఎస్.కామేశ్వరరావుకు సూచించారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

టీడీపీని సమాధి చేయడం ఖాయం



మాట్లాడుతున్న తులసీ వరప్రసాదరావు

కొత్తూరు: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పేదలు సమాధి కట్టడం ఖాయమని కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు అన్నారు. కొత్తూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పేదలకు స్థలాలను ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపడుతుంటే ఓర్వలేని చంద్రబాబు సమాధి నిర్మాణానికి కూడా ఆ స్థలం సరిపోదని వ్యాఖ్యానించడం అతని అహంకారానికి నిదర్శనమన్నారు. సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేసుకొని ఆనందంగా ఉన్న లబ్ధిదారులే టీడీపీని సమాధిచేస్తారని వాఖ్యానించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు అరసెంటు భూమి కూడా ఇవ్వలేకపోయారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేశారన్నారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో పేదలను, ప్రభుత్వ సొమ్మును దోచుకోవడం, దాచుకోవడం తప్ప మరో పని చేయలేదని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రేగేటి కన్నయ్యస్వామి, కొయిలాపు సంజీవరావు, లోతుగెడ్డ తాతబాబు, అంపిలి ప్రశాంత్, సవర రమేష్, పడాల వెంకటకృష్ణ ఉన్నారు.

పశుబీమాపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: వైఎస్సార్ పశుబీమా పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని పాతపట్నం పశువైద్యశాఖ సహాయ సంచాలకులు మంచు కరుణాకరరావు సిబ్బందికి సూచించారు. కోర్టు కూడలిలోని పశువైద్యశాఖ ఏడీ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యసిబ్బందితో పశు బీమాపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ బీమా పథకం కింద ఆవులు, గేదెలు, ఎద్దులు, పోతులు, గెర్రెలు, మేకలు, పందులకు బీమా చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించందన్నారు. ఈ విషయాన్ని గ్రామాల్లోని పాడి రైతులకు పశువైద్య సిబ్బంది తెలియజేయాలన్నారు. సమావేశంలో పశువైద్యులు శ్రీవాణి, అనిల్ కుమార్, మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికను సర్వే చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: క్రైస్తవుల శ్మశాన వాటిక కోసం వల్లపరాయ గెడ్డ వద్ద ప్రభుత్వం కేటాయించిన భూమిని సర్వేచేసి హద్దులు వేయాలని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 2018లో ప్రభుత్వం కేటాయించిన 177/పి సర్వే నంబర్ గల ఎకరా భూమిని క్రిస్టియన్ శ్మశానవాటికకు కేటాయించారని, భూమిని సర్వేచేయించి మ్యాపింగ్ చేసి ఎటువంటి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు డి.ఎలియా, సుందర్‌రాజు, మద్ది పాల్, బిమ్మో తదితరులు పాల్గొన్నారు.

బాల సాహిత్య సమ్మేళనంలో కూర్మారావు



కళింగ సీమ జానపద కళలు పుస్తకం పరిచయం చేస్తున్న బద్రి కూర్మారావు

పలాస: తెలంగాణా సారస్వత పరిషత్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల బాల సాహిత్య సమ్మేళనంలో జానపద పరిశోధకుడు, రచయత బద్రి కూర్మారావు పాల్గొన్నారు. పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన ఈయన సదస్సులో బాలసాహిత్యాన్ని పిల్లలకు చేర్చవలసిన పద్ధతులు, ప్రస్తుతం బాలసాహిత్యం పరిస్థితిపై మాట్లాడారు. సెల్‌ఫోన్ల ప్రభావంతో పిల్లల్లో పఠనాసక్తి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల్లో నైతిక విలువలు పెంచే విద్య అవసరమని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పద్మ భూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డి, డాక్టర్ కె.వి.రమణాచారి, దేశపతి శ్రీనివాస్, కార్యదర్శి జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై ఆరా



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామ్మూర్తి

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామ సచివాలయాన్ని పలాస ఆర్డీఓ తమరాల సీతారామ్మూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు, అర్జీల రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులకే అందించాలన్నారు. అనంతరం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ అంబరీష్‌తో కలిసి డెప్పూరు గ్రామాన్ని సందర్శించి ఎస్సీలతో మాట్లాడారు. రవాణా సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తెచ్చారు. మండల పరిషత్ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కె.రామారావు హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చే అభివృద్ధి నిధులను గ్రామానికి కేటాయించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, ఆర్ఐ శ్రవణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బూర్జలో స్పీకర్ తమ్మినేని పర్యటన

బూర్జ: బూర్జ మండలంలో స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం పర్యటించనున్నారు. కొల్లివలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో జరగనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమంలో స్పీకర్ పాల్గొంటారని ఆమదాలవలసలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్‌లో వరి సాగుకు అవసరమయ్యే విత్తనాలు కావలసిన రైతులు వారి వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో పైడి లతశ్రీ సూచించారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని వెళ్లి విత్తనాలు నమోదు చేసుకోవటంతో పాటు నగదు చెల్లిస్తే వారం రోజుల్లో విత్తనాలు సరఫరా చేస్తామన్నారు.

అమ్మవారికి పూజలు



శ్రీకాంత్‌కు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం ఆరాధ్యదైవం నీలమణిదుర్గ అమ్మవారిని పూజలు కొనసాగుతున్నాయి. తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ కాపువీధిలోని అమ్మవారిని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. కమిటీ సభ్యులు లింగాల మధుబాబు, లింగాల రవి, కాళ్ల రాజు, పైల బాబ్జి, యరకయ్య, సభ్యులు, అనపాన రాజశేఖర్‌రెడ్డి, జనపాల కన్నబాబు, జెన్నబాబు ఉన్నారు.

ఘనంగా అసిరమ్మ తల్లి సంబరాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో జరుగుతున్న గ్రామ దేవత అసిరమ్మతల్లి సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని ప్రత్యేక జంగిడిలో మేళతాళాలు మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా ఒడిశా గారడీ, విశాఖపట్నం కోలాటం నృత్యాలు ఆహుతుల్ని అలరించాయి.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నారాయణ కుటుంబానికి సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సోంపేట: మండలంలోని నడుమూరు ఉన్నత పాఠశాలలో 2005 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడు, గొల్లూరు గ్రామానికి చెందిన నారాయణ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో నారాయణ తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులకు సత్కారం



నరసన్నపేట: సత్కారం పొందిన వలంటీర్లతో నాయకులు



సారవకోట: డీఎల్‌పురంలో వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

నరసన్నపేట: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సేవకులకు సన్మానాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో వలంటీర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. నరసన్నపేట మండలం బొరిగివలస, దూకులపాడు, రావులవలస సచివాలయాల పరిధిలోని వలంటీర్లను ఎంపీపీ ఆరంగి మురళి సత్కరించారు. దూకులపాడులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్న వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తున్నారని కొనియాడారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మధుసూదనరావు, సచివాలయ మండల కన్వీనర్ సురంగి నర్సింగరావు, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, సర్పంచ్‌లు అవ్వ రవి, అల్లు అశిరినాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, నాయకులు బగ్గ రమణయ్య, రాజాపు అప్పన్న పాల్గొన్నారు.

☛ **సారవకోట:** చిన్నకిట్టాలపాడు, ధర్మలక్ష్మీపురం, మాళువ సచివాలయాలల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లను అధికారులు, నాయకులు సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎంపీడీవో విశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు పల్లి శ్రీహరి, అనిరుద్రుడు, మాళువ కనకమ్మ, నాయకులు కాళ్ల సింహాచలం, ఎస్.మురళీ, యు.రంజిత్, మామిడి అనీల్, కాంతారావు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



పూజలు చేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని కేకే రాజపురం గ్రామంలోని కల్యాణ సీతారామ ఆలయ పుష్కరం పంచముఖ ఆంజనేయ స్వామి వసంతోత్సవ వార్షికోత్సవాలను గ్రామానికి చెందిన కొరికేన వారి వంశీయులతో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి జ్యోతిష పీఠాధిపతులు, వేద పండితులు అంపోలు కేశవ శర్మ మంత్రోశ్చరణతో సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. ముందుగా ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం చేశారు. అలాగే పుణ్యాహవచనం, హోమాలు, గోవులకు పూజలు, విశేష జలముల నుంచి తీసుకు వచ్చిన స్వచ్ఛమైన నీటితో అభిషేకాలు, సీతారాముల కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం విరతణ చేశారు.

రైతులకు రాయితీపై విత్తనాలు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీతో అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు కోరారు. పలాసపురం రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జీవిత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

టెక్కలి రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని అటవీ శాఖాధికారి వై.సంజయ్ అన్నారు. శుక్రవారం నర్సింగపల్లి పంచాయతీ సవరకిల్లి గ్రామంలో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల సకాలంలో వర్షాలు పడతాయని, వాయు కాలుష్యం తగ్గి వ్యాధులు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారి రెడ్డి, ఎఫ్‌బీఓ ఝాన్సీ, ఏబీఓ గీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం

టెక్కలి: పట్టణంలో పలువురు నిరుపేద కుటుంబాలకు అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక గోపినాథపురం గ్రామానికి చెందిన ఆళ్ల హరికృష్ణ ఇటీవల ప్రమాదానికి గురి కావడంతో ఆ కుటుంబానికి రూ.6వేలు, మేదరవీధికి చెందిన పిల్లి జగ్గారావు ప్రమాదంలో గాయపడడంతో ఆ కుటుంబానికి రూ.6 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాది శ్రీనివాసరావు, పి.రమేష్, బి.నాగరాజు, డి.శ్రీను, ఆర్.ఈశ్వరరావు, ముక్తేశ్వర్‌దాస్ పాల్గొన్నారు.